


# విజయభాను


45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 23-08-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 288 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## పోలవరానికి నిధులు ఆలస్యం చేయకుండా విడుదల చేయాలి

### ఏపీకి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధాని మోదీతో సీఎం వైఎస్ జగన్ చర్చ

### కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌తో భేటీ అయిన సీఎం వైఎస్ జగన్



మర్యాదపూర్వకంగా రాష్ట్రపతిని కలిసిన సీఎం జగన్



ఢిల్లీ : ప్రధాని మోదీతో సీఎం వైఎస్ జగన్ భేటీ ముగిసింది. ఈ భేటీ సందర్భంగా పోలవరానికి నిధులు ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని ప్రధానిని సీఎం జగన్ కోరారు. నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీని త్వరితగతిన ఇవ్వాలని సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు. అలాగే, ఏపీకి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధాని మోదీతో సీఎం వైఎస్ జగన్ చర్చించారు. పోలవరం, రీసోర్స్ గ్యాప్ కింద నిధులు, విభజన హామీలు, ప్రత్యేక హెూదా సహా పలు అంశాలపై ప్రధానికి సీఎం జగన్ వినతి పత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని సత్వరమే పూర్తిచేయడానికి తగిన సహాయ సహకారాలు అందించాలని ప్రధానిని సీఎం కోరారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం రూ.2900 కోట్లు ఖర్చు చేశాము. వీటిని రీయింబర్స్ చేయాలని మోదీని సీఎం జగన్ కోరారు. పోలవరం సవరించిన అంచనాలకు ఆమోదం తెలపాలని కోరారు. టెక్నికల్ అడ్వైజర్ కమిటీ నిర్ధారించిన ప్రాజెక్ట్ వ్యయం రూ. 55,548.87 కోట్లకు ఆమోదం తెలిపాలని ప్రధానిని సీఎం జగన్ కోరారు. ఇప్పటి వరకు చేసిన పనులకు 15 రోజుల్లోగా రీయింబర్స్ చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రీసోర్స్ గ్యాప్ కింద ఏపీకి రావాల్సిన రూ. 32,625.25 కోట్లు మంజూరు చేయాలని సీఎం జగన్ కోరారు. తెలంగాణ డిస్కంల తరువాయి 2లో..

## 29న ఏపీ కేబినెట్ సమావేశం



అమరావతి (విజయభాను న్యూస్) : ఈనెల 29న ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం సమావేశమవుతుంది. సీఎం జగన్ అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించనున్నారు. సెప్టెంబర్‌లో నిర్వహించాల్సిన అసెంబ్లీ సమావేశాలపై కూడా చర్చించే అవకాశముంది. ఇవాళ సీఎం జగన్ అధ్యక్షతన మంత్రివర్గ తరువాయి 2లో..

## పదో తరగతి పరీక్షలపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం

**విజయవాడ, (విజయభాను న్యూస్) :** పదో తరగతి పరీక్షా విధానంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చింది. 6 పేపర్లతో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. సీబీఎస్ఈ సిలబస్ నేపథ్యంలో 6 పేపర్ల విధానం అమలు చేయనున్నారు. 2022-23 విద్యా సంవత్సరం నుండి అమలు చేయాలని విద్యా శాఖ నిర్ణయించింది.

## 20 వేల మందితో సాగరతీర స్వచ్ఛత (బీచ్ క్లీనింగ్) కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఈ నెల 26వ తేదిన నిర్వహించబోవు సాగరతీర స్వచ్ఛత కార్యక్రమాన్ని 20వేల మందితో చేపడుతున్నట్లు జిల్లా కలక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో ఈ విషయమై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలక్టరు మాట్లాడుతూ సాగరతీర పరిరక్షణకు "పార్లే" సంస్థ సహకారంతో సాగరతీర స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన 40 ప్రాంతాలలో బీచ్ క్లీనింగ్ ప్రోగ్రామ్ ను చేపడుతున్నట్లు కలక్టర్ తెలిపారు. ఉదయం 6గంటల నుండి 8 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, పర్యాటకులు తరువాయి 2లో..

## ఆగ్రా మున్సిపల్ కార్పొరేషన్ సందర్శించిన జివిఎంసి కార్పొరేటర్లు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఆగ్రా మున్సిపల్ కార్పొరేషన్ లో చేపడుతున్న అభివృద్ధి పనులు, వారు అవలంబిస్తున్న పద్ధతులు బాగున్నాయని నగర డిప్యుటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి కార్పొరేటర్లు బృందం ఆగ్రా మున్సిపల్ కార్పోరేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆగ్రా మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ నవీన్ జైన్, అదనపు కమిషనర్ సురేంద్ర సింగ్ యాదవ్, జివిఎంసి కార్పోరేటర్ల బృందానికి వారి ప్రాంతీయ పద్ధతులలో స్వాగతం పలికారు. ఈ తరువాయి 8లో..



## రఘురామపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు : సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: ఎంపీ రఘురామకృష్ణరాజుపై గచ్చిబౌలి పోలీసులు నమోదు చేసిన కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఎఫ్ఐఆర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులను సుప్రీం ఈ సందర్భంగా ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు స్టే విధిస్తూ జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ జె.కె.మహేశ్వరితో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఏపీ ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్‌ను నిర్బంధించి దాడి చేశారనే ఆరోపణలపై రఘురామ, ఆయన తనయుడు భరత్, భద్రతా సిబ్బందిపై గచ్చిబౌలి పోలీసులు గతంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే.





## అమిత్‌షా-ఎన్టీఆర్ భేటీపై కొడాలి నాని ఆసక్తికర వ్యాఖ్యలు



**గుడివాడ, (విజయభాను న్యూస్) :** కేంద్రహెూం మంత్రి అమిత్‌షా, ప్రముఖ సినీనటుడు ఎన్టీఆర్ భేటీపై ఏపీ మాజీ మంత్రి కొడాలి నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గుడివాడలో మీడియాతో ఆయన మాట్లాడారు. రాజకీయ వ్యూహంలో భాగంగానే ఎన్టీఆర్‌ను అమిత్‌షా కలిసి ఉంటారని చెప్పారు. రాష్ట్రాల్లో తమ పార్టీని విస్తరించుకోవడానికి మోదీ, అమిత్‌షా ద్వయం ఎన్నో వ్యూహాలతో ముందుకెళుతుందని.. దానిలో భాగంగానే ఈ భేటీ జరిగి ఉంటుందన్నారు. పాన్ ఇండియా స్టార్‌గా ఎన్టీఆర్ స్థాయి పెరిగిందని.. తెలుగు రాష్ట్రాలకే కాకుండా దేశవ్యాప్తంగా ఆయన సేవలు వినియోగించుకోవడానికి కూడా అయుండొచ్చని నాని చెప్పారు. ఈ భేటీకి రాజకీయ కారణాలు తప్ప.. సినిమాలు బాగున్నాయని ఎన్టీఆర్‌ను అభినందించేందుకే అంటే మాత్రం తాను నమ్మడం లేదన్నారు. భాజపాకు రాజకీయంగా ఉపయోగం లేకుంటే మోదీ, అమిత్‌షా ఒక్క నిమిషం కూడా ఎవర్నీ కలవరని కొడాలి నాని వ్యాఖ్యానించారు. ఆదివారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంలోని తరువాయి 2లో..

# ఏవీఎన్ కళాశాలలో ఆత్మీయ కలయిక

### - సందడి చేసిన పూర్వ విద్యార్థులు



పూర్ణామార్కెట్ (విజయభాను న్యూస్) : పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1993 నుంచి 1996 వరకు విశాఖలోని ఏవీఎన్ కళాశాలలో చదువుకున్నవారంతా ఆదివారం ఒకే చోట చేరి అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. శీలం లక్ష్మణ్, లలిత తదితరులు నిర్వాహకలుగా వ్యవహరించి కార్యక్రమాన్ని ముందుకు నడిపారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కూర్చుని కబుర్లు చెప్పుకొన్నారు. తాము ఏ విధంగా అభివృద్ధి చెందారో ఇతరులకు చెప్పారు. కళాశాల అభివృద్ధికి ఏమేం చేయాలో తీర్మానించుకున్నారు. కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రి నాయుడు మాట్లాడుతూ తాను కూడా ఇక్కడే చదువుకుని అక్కడే ప్రిన్సిపాల్ అయ్యానని గుర్తు చేసుకున్నారు. కళాశాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం కళాశాల సిబ్బందిని పూర్వ విద్యార్థులు జ్ఞాపికలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలతో పూర్వ విద్యార్థులు ఆడిపాదారు. సుమారు 100మంది ఒకే చోట చేరడంతో అక్కడి వాతావరణం సందడి గొలిపింది. పీడీ గోపీ కృష్ణ, అధ్యాపకురాలు లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.



## అందరూ బాగుండాలి..అందులో మనముండాలి

### - మిస్సెస్ ఇండియా ఏపీ విజేత పైడి రజిని



విశాఖపట్నం(విజయభాను న్యూస్): అందరూ బాగండాలి..అందులో మనముండాలి అని మిస్సెస్ ఇండియా ఏపీ-2021 విజేత పైడి రజిని అన్నారు. సమాజం బావుంటేనే మనం బాగుంటామని ఆమె అభిప్రాయపడ్డారు. సుజాత నగర్ లో మగువ డిజైనర్ స్టూడియో పేరిట ఓ ప్రత్యేక షోరూం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రజిని మాట్లాడుతూ

మహిళలు మెచ్చే శారీస్, డ్రెస్సెస్, డిజైనర్ వేర్ ఇక్కడ లభ్యమవుతాయన్నారు. హేమ కనస్ట్రక్షన్స్ ఎండీ బొత్స సురేష్ చేతుల మీదుగా షోరూం ప్రారంభి0చారు. ఆయన మాట్లాడుతూ నేటి మహిళల అభిరుచికనుగుణంగా ఇక్కడ వస్త్రాలు తయారవుతాయన్నారు. మగువ డిజైనర్ స్టూడియో ఎండీ ద్వారపూడి కల్యాణి మాట్లాడుతూ పలు వెరైటీస్ ఇక్కడ దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో నారీ బొటిక్ వ్యవస్థాపకురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా చారిటబుల్ సొసైటీతో కుట్టు శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్ల పంపిణీ



మద్రిపాలెం, (విజయభాను న్యూస్) : శివనగర్ స్థానిక గ్రంధాలయంలో ఆసరా చారిటబుల్ సొసైటీ సహకారంతో కుట్టు శిక్షణ పొందిన 40 మంది మహిళలకు కోర్సు పూర్తి చేసుకున్న సర్టిఫికేట్లు ఆసరా సంస్థ ప్రతినిధి శ్రీమతి సుధ గారి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన వారు ఆర్థికంగా ఎదగడానికి దీనిని ఉపయోగించుకోవాలని, సెంటరును నిరంతరం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జయలక్ష్మి, స్థానిక నాయకులు రమణ గారు, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఎం. సుధ, కృష్ణారావు పాల్గొన్నారు. టైలరింగ్ టీచరు రాజేశ్వరి మరియు కాత్యాయని శిక్షణ పొందిన వారు అందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరూ ఆసరా కి ధన్యవాదాలు తెలియజేశారు.

# మూడు ముళ్ల (దేశాల) బంధం



### - అమ్మాయిది జర్మని, అబ్బాయిది ఇండియా పెళ్లెమో అమెరికాలో

విశాఖపట్నం(విజయభాను న్యూస్): ప్రేమకు బాషా భేదం తెలియదు. ప్రేమకు వర్ణ భేదం తెలియదు. ప్రేమకు కుల భేదం తెలియదు. తెలిసిందల్లా ఒకటే.. స్వచ్ఛత, అదే స్వచ్ఛమైన ప్రేమ, అదే వారిద్దరి మనస్సులను కలిపింది. వారి ఆలోచనలనూ కలిపింది. అది ఎంతలా అంటే ఒకరిని వదిలి ఒకరు ఉండలేనంత.

జీవితాంతం కలిసి ఉండే అంత ధైర్యాన్నిచ్చింది. ఆ ధైర్యమే ఇప్పుడు వాళ్ళిద్దరిని ఒకటి చేసింది.

ఇదంతా ఎందుకంటే.. అమ్మాయిది జర్మని, అబ్బాయిది ఇండియా, అందులోనూ విశాఖ పట్నం, బాలయ్య శాస్త్రి లే అవుట్. ఇక్కడ ఇంకో విశేషం ఏమంటే ఈ పెళ్లి అమెరికాలో జరగడం.

విశాఖపట్నంలోని కళాసాగర్ అధినేత వానపల్లి శ్రీమన్నారాయణ కుమారుడు దైవిక్ శశాంక్, జర్మనికి చెందిన లిండా ముల్లర్ ప్రేమించుకున్నారు.

ఈ విషయం పెద్దలకు చెప్పడం, వాళ్లు అంగీకరించడంతో ఇటీవల వీళ్ళిద్దరి వివాహం అమెరికాలో అంగరంగ వైభవంగా జరిగింది. మూడు దేశాలతో ముడిపడిన ఈ వివాహ బంధం నిండు నూరేళ్ళ సుఖంగా, సంతోషంగా ఉండాలని మనమందరం ఆశీర్వదిద్దాం.

మొదటి పేజీ తరువాయి

## 20వేల మందితో సాగరతీర స్వచ్ఛత (బీచ్ క్లీనింగ్) కార్యక్రమం

ఎక్కువగా సంచరించే బీచ్ తీర ప్రాంతాలలో ఎక్కువ ప్రాధాన్యత నివ్వడం జరుగుతుందన్నారు. బీచ్ క్లీనింగ్ ప్రోగ్రామ్ ను ఫొటోలు/వీడియో రికార్డు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారి కోసం అవసరమైన మంచినీరు, గ్లౌజులు, డస్ట్ బిన్లు, డస్ట్ కలక్షన్ బ్యాగులను తదితరాలను ఏర్పాటు చేయవలసినదిగా జి.వి.ఎం.సి అధికారులను ఆదేశించారు. విశాఖనగరంలో 20వేల మందితో బీచ్ క్లీనింగ్ ప్రోగ్రామ్ గిన్నీస్ రికార్డులో చేరే అవకాశం ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు నేవీ, పోలీస్, వాలంటీర్ సంస్థలు, విద్యాసంస్థలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛందంగా అంకిత భావంతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. తదుపరి ఈ కార్యక్రమం నిర్వహణ పై గౌరవ ముఖ్య మంత్రికి ప్రజంటేషన్ ద్వారా వివరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.వి.ఎం .సి కమిషనర్ లక్ష్మీషా, జిల్లా అటవీ అధికారి రాహుల్ పాండే, డి.సి.పి. సునీల్ సుమిత్ గరుడ్, డి.ఆర్.ఓ శ్రీనివాసమూర్తి, ఆర్.డి.ఓ హుసేన్ సాహేబ్, నేవీ అధికారులు.

## 29న ఏపీ కేబినెట్ సమావేశం

ˇమావేశం జరగనుంది. జూన్ 24 న చివరిసారిగా జరిగిన భేటీలో మంత్రివర్గం పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. మొత్తం 42 అంశాలపై కేబినెట్ భేటీలో చర్చించారు. కోనసీమ జిల్లాకు అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు మార్పు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అమ్మఒడి పథకానికి, రూ.15వేల కోట్లతో ఏర్పాటు కానున్న గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది.

## అమిత్‌షా-ఎన్టీఆర్ భేటీపై కొడాలి నాని ఆసక్తికర వ్యాఖ్యలు

నోవాటెల్ హొటల్‌లో అమిత్‌షా- ఎన్టీఆర్ భేటీ జరిగిన విషయం తెలిసిందే. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో 20 నిమిషాలు ఇద్దరూ ఏకాంతంగా చర్చించుకున్నారు. అనంతరం ఎన్టీఆర్‌తో కలిసి అమిత్‌షా భోజనం చేశారు.

## పోలవరానికి నిధులు ఆలస్యం చేయకుండా విడుదల చేయాలి



నుంచి రావాల్సిన బకాయిల అంశాన్ని కూడా ప్రధాని వద్ద సీఎం జగన్ ప్రస్తావించారు. రూ. 6,756 కోట్ల బకాయిలు ఉన్నాయని, 8 ఏళ్లుగా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ క్రమంలోనే విభజన హామీలు అమలు చేయాలని కోరారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని ప్రధాని మోదీని సీఎం వైఎస్ జగన్ కోరారు. ప్రత్యేక హొదాతోపాటు హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మరో 12 మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని సీఎం జగన్ వినతి పత్రం అందజేశారు.

## నిర్మాణ దశలో ఉన్న భవనాలకు గ్రీన్ తెరలు వేయండి

### - జివిఎంసి కమిషనర్ డాక్టర్.జి. లక్ష్మిశ




**విశాఖపట్నం,** నిర్మాణ దశలో వున్న భవనాలకు గ్రీన్ తెర తప్పనిసరిగా వేయాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మిశ పేర్కొన్నారు. సోమవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా నాలుగవ జోన్ 28వ వర్డు పరిధిలోని రాంనగర్, నెహ్రూ నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డులలో నిర్మాణ దశలో ఉన్న భవనాలకు గ్రీన్ తెరలను ఉపయోగించాలని, గ్రీన్ తెరలు ఉపయో గించని భవన యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఇవ్వాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటి నుండి క్లాప్ వాహనాల ద్వారా ప్రతి రోజు తడి పొడి చెత్త సేకరణ చేయాలని ఆదేశించారు. కాలువలో పూడికలు సరిగా చేయడం లేదని, పూడికలు వెంటనే తొలగించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. అనంతరం సీజనాల్ వ్యాధులపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గిన్న ప్రజలకు దోమలు ఎలా అభివృద్ధి చెందుతాయో స్వయంగా చూపించారు. ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటించాలని, మూడు దినాల కంటే ఎక్కువ రోజులు ఇంటిలో నీరు నిల్వలేకుండా చూడాలని, పరిసరాలు పొడిగా ఉండేటట్లు చూడాలని పజలకు సూచించారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించాలని, వాటి నిర్మూలనకు కృషి చేస్తూ, ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలకు డెంగ్యూ, మలేరియా తో పాటూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ చక్రవర్తి, పర్యవేక్షక ఇంజినీరు కృష్ణా రావు, ఎసిపి వెంకటేశ్వర రావు, ఎఎంఓహెచ్ డాక్టర్ కిషోర్, ఎపిడి పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇస్పెక్టర్, వార్డు సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొనారు.

ప్రకటన

మహారాజశ్రీ భీమునిపట్నం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.34/2020 O.S.24/2020

Between:

జగ్గుపల్లి అప్పలసూరి మరి ఒకరు ...వాది

And:

జగ్గుపల్లి చిట్టిబాబు వగైరాలు ...ప్రతివాది

To,

D-6: యర్ల నీలవేణి W/o. సత్యన్నారాయణ, హిందు, వయస్సు 35సం॥, Employee in co-operative Bank,Near D.No.1-43-80, బాలాజి నగర్, తగరపువలస, భీమునిపట్నం మండలం, విశాఖపట్నం జిల్లా

D-7: Sukhasi రమణ S/o. లేటు నరసింగరావు,హిందు,వయస్సు 54సం॥, R/o.D.No.51/16-5/2, కాంతినగర్, నక్కవానిపాలెం, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు I.A.34/2020 O.S.24/2020 లోని ప్రతివాదులు అయిన మీకు సమన్లు జారీ నిమిత్తం కోర్టు ద్వారా,మరియు రిజిష్టరు పోస్టు ద్వారా పంపించివున్ననూ మీకు సదరు విషయం గుర్తెరిగి కూడా పుచ్చుకొనకుండా "avoid" చేయించున్నందున Substituted service ద్వారా సర్వు నిమిత్తం పై కోర్టువారు ఉత్తర్వులు జారీ చేస్తూ **తే.07-09-2022 దీని ఉదయం 10-30ని॥** స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గాను కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకోవలెనని,లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించెదరని యిందు మూలంగా తెలియజేయడమైనది.

భీమునిపట్నం

తే: 22-08-2022

**పి.సుందర్‌సింగ్**
**ఎం.సి.హెచ్.పాత్రుడు**
**కె.వసంత**
**పిటీషనర్లు తరపు న్యాయవాదులు**



**మహారాజశ్రీ విజయనగరం 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో**

**O.S.45/2021**

Between:

**పందిరిపల్లి జనార్ధనరావు ...వాది**

And:

**కోరాడ ఇంద్రారావు వగైరాలు ...ప్రతివాదులు**

To

**D-1**: కోరాడ ఇంద్రారావు S/o.చినరామస్వామి, ఇంటినెం.1-37, వేములవలస, ఆనందపురం మండలం, విశాఖపట్నం జిల్లా.

**D-2**: కోరాడ కనక మహాలక్ష్మి W/o. ఇంద్రారావు, ఇంటినెం.1-37, వేములవలస, ఆనందపురం మండలం, విశాఖపట్నం జిల్లా.

**D-4**: ఆర్తి అనురాధ W/o.ఆర్తి నర్సింగరావు, ఇంటినెం.7-135, వుడాకాలనీ, విజయనగరం.

పై నెంబరు దావాలో మీకు అనేకసార్లు సమన్లు పై కోర్టు వారి నుండి పంపినా మీరు తీసుకోనందున పై తెల్పిన దావా మీకు నోటీసు నిమిత్తం **తే.29-08-2022 దికి** వాయిదా వున్నది.సదరు దావాలో మీకు ఎట్టి ఆక్షేపణలున్న ఎడల **తే.29-08-2022దీన ఉదయం 10-30గం॥లకు** మీరు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను.లేనిచో సదరు దావా మీ పరోక్షమందు తీర్మాణించబడును.

**ఇట్లు**
**J.BHEEMASENA RAO**
**Advocate**
**VIZIANAGARAM**
**Cell : 9441053628**


# అమ్మవారి గుడి హుండీలో చోరీ

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : : విజయభాను న్యూస్ భీమిలి మండలం ,రేఖవానిపాలెం పంచాయతీ లో ఉన్న మూడు అమ్మవార్ల గుడిలో హుండీలో డబ్బులు చోరీకి గురయినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రేఖవానిపాలెం పంచాయతీ లో ఉన్న నూకాలమ్మ, పాతమరిడమ్మ,కొత్త మరిడమ్మ గుడిలలో శనివారం పూజలు నిర్వహించి రాత్రి 9గంటల ప్రాంతంలో ఆలయ పూజారి గుడి గేట్ కు తాళం వేసి వెలిపోయారు. కాగా ఆదివారం ఉదయం 7 గంటలకు గుడి తలుపులు తీద్దామనీ చూడగా తాళం పగలకొట్టి ఉండడంతో లోపల చూడగా నూకాలమ్మ,పాత మరిడమ్మ గుడిలలో హుండీలు పగులగొట్టి ఉన్నాయనీ, అందులో 5వేల రూపా యలు ఉన్నాయనీ, గుర్తు తెలియనివ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ మెంబర్ సమ్మిడి పోతురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లేడీ క్రైం హెడ్ కానిస్టేబుల్ బి.సుజాత దర్యాప్తు చేస్తున్నారు.

# సత్యదేవుడ్ని దర్శించుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



అన్నవరం (విజయభాను న్యూస్): కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు,పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి శాఖ మాత్యులు బూడి. ముత్యాలనాయుడు శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.వి.సత్యనారాయణ మూర్తి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేయగా ఈవో శ్రీ స్వామివారి ప్రసాదమును అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పిఆర్వో కొండల రావు, సూపరింటెండెంట్లు రమణ,ఐ.వి.రామారావు, స్థానిక ఎస్సై శోభన్ కుమార్,వైసీపీ నాయకులు వాసిరెడ్డి జెమీలు,ఆరై భాస్కర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికలపై లైంగిక వేధింపులు ఆపండి కార్యక్రమం



భీమునిపట్నం(విజయభాను న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం- విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం బాలికలపై లైంగిక వేధింపులు ఆపండి కార్యక్రమంలో భాగంగా సోమవారం 1వ వార్డ్, బంగ్లామెట్ట ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డిపిల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారిణి కె.ఎ బాలామణి, భీమిలి ట్రాఫిక్ ఎస్.ఐ చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పాఠశాల విద్యార్థులుకు తల్లితండ్రులుకు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. టచ్ డోంట్ టచ్ గురించి వివరించారు. ఆడపిల్లలకు సమస్యలు ఎదురైతే ఉమెన్ హెల్ప్ లైన్ 181,దిశ హెల్ప్ లైన్ 112, చైల్డ్ హెల్ప్ లైన్ 1098,ఎ.పి పోలీస్ 100,ఎమర్జెన్సీ అయితే 108 కాల్ చేయాలని అన్నారు.

ట్రాఫిక్ ఎస్.ఐ చిరంజీవి ట్రాఫిక్ నియమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లిక, నాగమణి, హెడ్ కానిస్టేబుల్ రామ్ ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

# సంగీత కళా కారులకు సత్కారం

## - హాజరైన మేయర్ గొలగాని హరి వెంకట కుమారి




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రతిభా వంతులైన కళాకారుల్ని సత్కరించడం ప్రశంసనీయమని విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక కళా భారతి ఆడిటోరియంలో స్వర సాగర్ కల్చరల్ ఫౌండేషన్ పేరుతో నూతన సంస్థ ఆవిర్భావ సభలో పాల్గొన్న మేయర్ గొలగాని మాట్లాడుతూ...

అలనాటి పాటల్లో సాహిత్యానికి అనుసరిస్తూ సంగీతం ఉండేదని ఇప్పుడు సంగీతానికి తగ్గట్టు సాహిత్యం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా ఖ్యాతి గాంచిన విశాఖలో సరైన కళా వేదికలు కరవయ్యాయని దీనిపై తక్షణమే చొరవ తీసుకోవాలని మేయర్ ను కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ కళా కారులు ఏవీ చలం, మాడు గుల సన్నిబాబు, ఆలాపన శ్రీనివాస్ లను అతిధులు ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా ప్రియ తమా నీ ఊపిరే నాకు ప్రాణం శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరిలో మేలుకో శ్రీరామా, మబ్బే మసకేసిందిలే, చేయి చేయి తగిలింది, అంకితం నీకే అంకితం, గిరిలో లాహిరి, నీ మీద నాకు, శివ రంజని, అత్తో అత్తమ్మ కూతురో వంటి గీతాలను గాయనీ గాయ కులు ఆలపించి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రంగ సాయి నాటక సంఘం అధ్యక్షుడు బాదం గిర్ సాయి, ఏయు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గుంటుబోయిన రవి కుమార్, సంగీత కళాకారుల సంఘం కార్యదర్శి చెన్నా తిరుమలరావు, స్వర సాగర్ అధ్యక్షులు కిలాని సింగ్, కార్యదర్శి రత్నా సింగ్, కేజీహెచ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నీలాపు శ్రీనివాసరావు, సీనియర్ ఛాయా గ్రహకుడు బుర్రా శ్రీనివాస్ రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ




కాకినాడ(విజయభాను న్యూస్) విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడు కోవాలని కోరుతూ రేపు రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుండి పీజీ విద్యాసంస్థలు బంద్ కు ఎస్ఎఫ్ఐ- ఇతర విద్యార్థి సంఘాలు పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ పిలుపులో భాగంగా రేపు కాకినాడ నగరంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో, కళాశాలలో బంద్ కి సహకరించాలని కోరుతూ ఈరోజు బాలజీ చెరువు సెంటర్ నుండి ఇంద్ర పాలెం లాకుల వద్ద వరకు వివిధ స్కూల్స్, కళాశాలకు సైకిల్ పై ర్యాలీగా వెళ్లి బంద్ నోటీసులు ఇవ్వడం జరిగింది. ఈ ర్యాలీని ముందుగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. రాజా జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.రాజా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో రాకముందు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీరం చేయడం కోసం పాఠశాల స్థాయి నుంచి మూడు 3,4,5 తరగతులు వీలీనం చేస్తుందని నేటికీ చాలా పాఠశాలలో విద్యా కానుక కీట్లు, పాఠ్యపుస్తకాలు ఇవ్వడం లేదని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో యూనివర్సిటీల్లో అధ్యాపక,ప్రొఫెసర్ పోస్టుల్ని భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు టీ.మణికంఠ సాయి, ఎం. గంగా సూరిబాబు నగర నాయకులు కళాశాల కమిటీ సభ్యులు సూర్య, జయరాజు, జాన్, రాజేష్, రాజకుమార్, అవినాష్, సింహాద్రి,జీవన్ ,ప్రసాద్, బాల,బాసిర్, రోసినీ, రమాదేవి, దేవిశ్రీ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# మెగా అభిమానుల రక్తదానం

## - 60 ఏళ్ల వయసులో 30 సార్లు
## - 56 ఏళ్ల వయసులో 50 సార్లు రక్త దానం చేసిన స్ఫూర్తి దాతలు



విశాఖపట్నం(విజయభాను న్యూస్) : మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా సుమారు 50 మందికి పైగా రక్తదానం చేశారు. జిల్లా పరిషత్ సమీపంలోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో నిర్వహించిన ఈ శిబిరంలో.. ఇప్పటికే 30 సార్లకు పైగా రక్త చేసిన "రెడ్ క్రాస్ "రావు మరో సారి రక్త దానం చేశారు. 60 సంవత్సరాలు నిండినప్పటికీ రావు ఉత్సాహంగా రక్త దానం చేస్తుండడం అభినందనీయం అని రెడ్ క్రాస్ చైర్మన్ శివనాగేంద్ర రెడ్డి, సెక్రటరీ రవికుమార్ అభినందించారు. అదే విధంగా మెగా అభిమాని కొయిలాడ శ్రీనివాసరావు 56 సంవత్సరాలు పైబడినా సుమారు 50 సార్లుకి పైగా రక్తదానం చేయడం సమాజంలో ఎందరికో స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్య క్రమం లో ఉత్తరాంధ్ర మెగా ఫ్యామిలీ యువత అధ్యక్షులు పాలరౌతు వెంకట రమణ, కొసనం మూర్తి, శ్రీకన్య శివ, మల్కాపురం ఈశ్వర రావు, శ్రీనివాస్, దాసరి బుజ్జి, వాసుపల్లి ఎల్లాజీరావు, లంక శ్రీనివాసరావు, మధు, మీరా లు పాల్గొన్నారు.

# నాడు నేడుతోనే పాఠశాలలు అభివృద్ధి


## - సర్పంచ్ సిరపురపు




పరవాడ (విజయభాను న్యూస్) : నాడునేడు తోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయి అని సర్పంచ్ సిరపురపు అప్పల నాయుడు తెలిపారు. విద్యారంగంలో ఏపి సియమ్ జగనన్న మార్పులు తీసుకు వచ్చారని పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు అన్నారు. సోమవారం పరవాడ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు నాడునేడులో మంజూరైన 12 లక్షల నిధులతో పాఠశాలలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై పాఠశాల సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంధితో సర్పంచ్ సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వం నాడునేడులో పాఠశాలల అభివృద్ధితో నాణ్యమైన విద్యను అందిస్తూ మౌళిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తుందని అన్నారు.ఈ నిధులతో పాఠశాలలో ఎలక్ట్రిక్ పనులు, మరుగుదొడ్లు, ప్రహారి నార్మాణం, ఆర్ ఒ ప్లాంటు,ఎంట్రన్సె గేట్ వంటి పనులను అధికారుల పర్యవేక్షణలో ప్రారంభించి పూర్తి చేయాలని సర్పంచ్ సూచించారు.

ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సిరపురపు రాజేష్, పాఠశాల హెచ్ ఎం నాగేశ్వర్రావు, ఉపా ధ్యాయులు అమ్ముునాయుడు,భారతి,సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మూడు ముళ్ల (దేశాల) బంధం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అమ్మాయిది జర్మని, అబ్బాయిది ఇండియా.. పెళ్లెమో అమెరికాలో ప్రేమకు బాషా భేదం తెలియదు. ప్రేమకు వర్ణ భేదం తెలియదు. ప్రేమకు కుల భేదం తెలియదు. తెలిసిందల్లా ఒకటే.. స్వచ్ఛత, అదే స్వచ్ఛమైన ప్రేమ, అదే వారిద్దరి మనస్సులను కలిపింది. వారి ఆలోచనలనూ కలిపింది. అది ఎంతలా అంటే ఒకరిని వదిలి ఒకరు ఉండలేనంత. జీవితాంతం కలిసి ఉండే అంత ధైర్యాన్నిచ్చింది. ఆ ధైర్యమే ఇప్పుడు వాళ్ళిద్దరిని ఒకటి చేసింది. ఇదంతా ఎందుకంటే.. అమ్మాయిది జర్మని, అబ్బాయిది ఇండియా, అందులోనూ విశాఖపట్నం, బాలయ్య శాస్త్రి లే అవుట్. ఇక్కడ ఇంకో విశేషం ఏమంటే ఈ పెళ్లి అమెరికాలో జరగడం. విశాఖపట్నంలోని కళాసాగర్ అధినేత వానపల్లి శ్రీమన్నారాయణ కుమారుడు దైవిక్ శశాంక్, జర్మనికి చెందిన లిండా ముల్లర్ ప్రేమించుకున్నారు. ఈ విషయం పెద్దలకు చెప్పడం, వాళ్లు అంగీకరించడంతో ఇటీవల వీళ్ళిద్దరి వివాహం అమెరికాలో అంగరంగ వైభవంగా జరిగింది. మూడు దేశాలతో ముడిపడిన ఈ వివాహ బంధం నిండు నూరేళ్ళ సుఖంగా, సంతోషంగా ఉండాలని మనమందరం ఆశీర్వదిద్దాం.

-చెన్నా

## రాజలింగంపేట శ్మశానం వాటికకు కనీస సదుపాయాలు కల్పించాలి

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : జివిఎంసి, భీమిలి జోన్ 2వ వార్డు రాజలింగంపేట స్మశానం వాటికకు కనీస సదుపాయాలు కల్పించాలని బీజేపీ 1,2 వార్డు అధ్యక్షురాలు శీరపు. రామలక్ష్మి డిమాండ్ చేసారు. ఆదివారం స్మశానం వాటిక ప్రాంతానికి వెళ్లి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ప్రతీ స్మశానం లో దహన వాటిక అంతిమ సంస్కారం చేయటానికి వీలుగా సదుపాయాలు నీటికోసం గొట్టపు బావి వంటివి ఏర్పాటు చేయవలసి ఉంది కానీ జి వి ఎం సి అధికారులు ఎటువంటి సదుపాయాలను కల్పించలేదనీ,లోపలకి వెళ్ళటానికి ప్రైవేటు స్థలం లో ఉన్న రహదారిని మూసివేయటం వలన చుట్టూ తిరిగి వెళ్ళవలసి వస్తుందని అన్నారు. డెక్కతిపాలెం, మామిడి పాలెం తదితర శివారు గ్రామాలకి స్మశానం ఉన్నప్పటికీ ఈ గ్రామానికి ఉన్న స్మశానం నిరుపయోగంగా అయిపోయిందనీ అన్నారు. ఇటీవల కాలంలో ఈ గ్రామం లో మరణించిన వ్యక్తిని దహనం చేయటానికి గ్రామస్థులు నానా అవస్థలు పడుతున్నారనీ అన్నారు. అధికారులు రాజలింగంపేట లో స్మశానం ఉన్న స్థలాన్ని అధికారంగా గుర్తించి కనీస సదుపాయాలు కల్పించాలని బీజేపీ డిమాండ్ చేస్తుందని రామలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ సీనియర్ నాయకులు సాదురావు తోనంగి రాము కరుణ వెంకటరావు, వెంకటేష్, సురేష్, స్థానికులు శ్రీను ఈశ్వర్, శైలు, వంశీ, బుజ్జి సురేష్, సాయి అశోక్, వెంకటప్పారావు ,అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## ఆవు-పులి కథ అందరికీ తెలిసిందే...

'కర్షక వీరుల కాయం నిండా/ కాలువగట్టే ఘర్మజలానికి/ ఘర్మజలానికి/ ధర్మజలానికి/ ఘర్మజలానికి ఖరీదు లేదోయ్' అని మహాకవి శ్రీశ్రీ చెప్పిన దానిలో 'ధర్మజల'మనేది అమ్మ పాలకూ వర్తించే గొప్ప పదం. తల్లిప్రేమకు సాటి మరేదీ రాదు. తల్లిపాలకు మరే ప్రత్యామ్నాయమూ లేదు. తల్లి పాల ప్రాధాన్యతను తెలిపే ఆవు-పులి కథ అందరికీ తెలిసిందే. అడవికి మేతకెళ్లిన ఆవు... ఓ పులికి చిక్కుతుంది. చంపేస్తానని హూంకరిస్తుంది. అలాంటి ప్రాణాపాయ స్థితిలోనూ ఆవుకు తన బుజ్జి దూడ గుర్తొస్తుంది. తల్లి మనసు తల్లడిల్లుతుంది. బిడ్డకు చివరిసారిగా పాలిచ్చి వస్తానని పులిని బతిమాలుతుంది. ఆ ఆవు చివరి కోరిక తన బిడ్డకు పాలివ్వడమే. దీన్నే భోజరాజీయంలో 'మునుమును బుట్టి నాకు నొక ముద్దుల పట్టి, యతండు పుటియే/ డెనిమిది నాళ్ళపాటిగలడింతియ, పూరియు మేయ నేరడే/ జని, కడుపార జనుడిపి చయ్యన వచ్చెద, నన్ను బోయిర/ మ్మని సుకృతంబు గట్టి కొన వన్న దయాగుణ ముల్లసిల్ల గన్' అని వర్ణించాడు కవి. అమ్మ ప్రేమకూ... అమ్మ పాలకూ జాతి భేదాల్లేవు. అన్ని జీవుల్లోనూ తల్లి తల్లే. అది శునకమైనా, వరాహమైనా, గోవైనా... ఏ జంతువైనా తన బిడ్డకు ఎంతో ఆప్యాయంగా పాలిస్తూ తన్మయత్వం చెందుతాయి.

తల్లి పాలు... కల్తీ లేనివి, కల్తీ చేయలేనివి. నవమాసాలు గర్భంలో ఉన్న బిడ్డతో ప్రేమ బంధాన్ని మరింత బలోపేతం చేసేవి. ఉద్యోగ అవసరాలు, అనారోగ్యం వంటి కారణాలతో కొందరు తల్లులు బిడ్డలకు పోతపాలు పడుతుంటారు. ఈ అవసరాన్ని కూడా సొమ్ము చేసుకునే ప్రబుద్ధులు... స్వచ్ఛమైన పాలను కల్తీ చేస్తున్న ఘటనలు కోకొల్లలు. పాలు కరువై... పొంగునీళ్లతో పసి కడుపు నింపే తల్లులకూ ఈ దేశంలో కొదవ లేదు. 70 కోట్ల మంది పేద ప్రజలున్న ఈ దేశంలో, మూడు పూటలా తినేందుకు సరైన ఆహారం కూడా లేక అర్ధాకలి జీవితాలు గడుపుతున్నారు. పౌష్టికాహార లోపంతో లక్షలాది బిడ్డలు అనారోగ్యం పాలవుతున్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా పసిబిడ్డలు తాగే పాలపై కూడా జీఎస్టీ విధించిన ఘనత మోడీ ప్రభుత్వానిది. 'బిడ్డల పాలకై / బిచ్చమెత్తు దేశంలో/ రాళ్లకు పాలిచ్చు/ కథ నశించునదెన్నడో' అంటాడు కరుణానిధి. తల్లిపాలు తాగని నవజాత శిశువులు డయేరియా వ్యాధిన పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. డబ్బా పాలతో ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా... ఎదుగుదల తక్కువగా ఉంటుంది. అప్పుడే పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలి. ఆ పాలలో శక్తివంతమైన యాంటీబాడీలు ఉంటాయి. ఇవి బిడ్డకు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తినిస్తాయి. ముర్రుపాలు బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకా అని చెప్పొచ్చు. అలాంటి బలమైన తల్లిపాలు సరిపోక, భారతదేశంలో ఏటా లక్షమంది శిశువులు చనిపోతున్నట్లు ఐక్యరాజ్య సమితి లెక్క కట్టింది. 'ప్రేమను రంగరించి శిశు ప్రాణము నిల్పగ చాలినంతగా' పాలు అమ్మల దగ్గర లేకపోవడం ఒక కారణం.

తల్లిపాలను, కన్నీళ్లను కూడా కల్తీ చేసే కార్పొరేట్ వ్యాపార సంస్కృతికి పాలుతాగే బిడ్డలు బలవుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. కల్తీ పాలను అరికట్టాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తల్లి పాల విశిష్టతను తెలిపేందుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రతియేటా ఆగస్టు మొదటి వారంలో 'తల్లిపాల వారోత్సవాలు' నిర్వహిస్తున్నారు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వకుంటే భవిష్యత్‌లో అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం వుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. నవజాత శిశువుకు తల్లిపాలు అమృత తుల్యం. ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ పౌష్టికాహారం తల్లిపాలే. నెలలు నిండకుండా పుట్టి ఎన్ఐసియులో ఉన్న పిల్లలకు పీడియాట్రిక్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మిల్క్ బ్యాంకులు ఉన్నాయి. పాలు దానం చేయాలనుకునే తల్లులు ఈ మిల్క్ బ్యాంకులకు దానం చేయవచ్చు. 'పసివగ్గు తొలి ఆరుమాసాలూ సంపూర్ణంగా తల్లిపాలమీదే ఆధారపడే క్షీరద' అని ఆయుర్వేదం చెబుతోంది. 'డబ్బా పాలు వద్దు- తల్లి పాలే ముద్దు' అనే నినాదం నలుదిక్కులా మార్మోగాలి. అప్పుడే మహాకవి జాషువా పేర్కొన్నట్లు 'అక్షయంబులైన మాతక్షీర మధురధార/ లన్నంబుగా తెచ్చుకున్న అతిథి'కి ఆహారం, ఆరోగ్యం దక్కుతుంది. అమ్మపాలే మిసిమి ప్రాయంలోనూ, ముదిమి వయసులోనూ సంజీవని.

# గ్రుడ్డి ప్రభుత్వం కళ్లు తెరవదా? స్పందనకు ఏది స్పందన?

**- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురుగుబెల్లి రాజేశ్వరరావు**



శ్రీకాకుళం(విజయభాను న్యూస్) : సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని సొంత డప్పు కొట్టుకొంటున్న జగన్మోహన రెడ్డి గ్రుడ్డి ప్రభుత్వం కళ్ళు తెరవాలని నిజమైన అర్హత గల లబ్ధి దారునికి దళిత డప్పు కళాకారునికి రెండున్నర సంవత్సరాలుగా పెన్సన్ ఇవ్వకుండా తిప్పుతూ "ఆధార్" ప్రామాణికంగా నీకు వయస్సు చాలటంలేదని 10 వ తరగతి సర్టిఫికేట్ పనికి రాదని చెప్పటం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అలా అన్నారని 10 వ తరగతి సర్టిఫికేట్ చూపి ఆధార్ వయస్సు మార్పు చేసి క్రొత్త ఆధార్ కార్డు తీసుకొని వస్తే మార్పు చేశావు కాబట్టి పనికిరాదు అని స్థానిక యమ్.పి.డి.ఓ. అనడం ఇంకొంచెం ముందుకు వెళ్ళి ఆ సర్టిఫేకేట్ ఒరిజినల్ కాదని లబ్దిదారుడు నీలకంఠంతో వాగ్వాదం చేయటం హాస్యాస్పదం. ఈ విషయం ఈ రోజు స్పందన కార్యక్రమంలో మరొక వినతిపత్రం ఇచ్చారు. సరుబుజ్జిలి మండలం చిగురువలస గ్రామం నీలకంఠం ఒక దళిత డప్పు కళాకారుడు. తనకు డప్పు కళాకారుల పెన్షన్ కు అన్ని విధాలా అర్హతలు ఉన్నాయని స్థానిక చోటా నాయకుల ప్రాభల్యంతో ఇన్నాళ్లు పెన్సన్ చేయలేదని ఒక నెల క్రిందట స్పందన ద్వారా కలెక్టరు గారికి అర్జీ ఇచ్చి విషయం వివరించినా ఫలితం లేదని మరలా ఈ రోజు డి ఆర్ ఓ మరియు డ్వామా పి డి గారిని కలిసి వివరించామని రాజేశ్వరరావు అన్నారు. అన్ని సంక్షేమ పథకాలకు ఆధార్ లింక్ పెట్టడం మంచి పరిణామమే కానీ అదే ఆధార్ ప్రకారం అర్హతలు కూడా చూడడం జరుగుతుంది కదా అలా ఎందుకు అధికారులు చేయరు అని ప్రశ్నించారు. కవిటి మండలం బి.గొనగ పుట్టుక గ్రామానికి చెందిన 76 సంవత్సరాల బాలక లోకనాథం అనే కళాకారుడుకు గతనెల వరకు 15 సంవత్సరాల కాళం తీసుకొన్నాడు. ఆయన కుమారుడు పేరున ఒక కారు ఉందని పెన్షన్ తీసివేశారు. అతనికి సెంటు భూమి లేదు, ఆతని ఇంట్లో ఒక ప్రభుత్వ ఉద్యోగి కాదుకదా ప్రైవేటు ఉద్యోగి కూడా లేరు. ఆయనపై ఆధారపడి భార్య కుమారుడు కోడలు మనముడు ఐదుగురు ఉన్నారు. నిజంగా ఈ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకం ఎంతైనా అవసరం అని రాజేశ్వరరావు అన్నారు. ఎద్దు ఈనింది అనగానే గొందిలో కట్టేయమన్నట్లు కాకుండా గ్రౌండ్ లెవెల్ రిపోర్టు తీసుకొని అధికారులు చర్యలు చేపడితే చాలా ఆనందం. ఉల్టా చర్యలు తీసుకొనే అధికారులపై ఉద్యమాలు తప్పవని ప్రభుత్వానికి, అధికారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెన్సన్ అర్హుతదారుడు నీలకంఠం,యమ్.సింహాచలం లు పాల్గొన్నారు.

# జగన్ అలా అనేందుకు అవకాశం లేదు.. అన్నీ రికార్డెడ్‌గా ఉన్నాయి




అమరావతి: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని.. వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. థర్డ్ పార్టీ వ్యవస్థ రద్దు చేసి, యాజమాన్యమే సమాన పనికి సమాన వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సీఎం జగన్‌కు లోకేశ్ లేఖ రాశారు. కార్మికుల విషయంలో సీఎం జగన్ నిర్లక్ష్య వైఖరి చూస్తుంటే.. ప్రతిపక్షనేతగా అసెంబ్లీలో కాంట్రాక్టు కార్మికుల కోసం ఆనాడు కార్చింది మొసలి కన్నీరని అర్థమవుతోందన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యార్హత, అనుభవం, సర్వీసుని పరిగణనలోకి తీసుకుని రెగ్యులర్ చేస్తామని, యాజమాన్యానికి-కార్మికులకు మధ్య ఉన్న దళారీ వ్యవస్థను రద్దు చేసి విద్యుత్ సంస్థ నుంచే జీతాలు ఇప్పిస్తామని జగన్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. తాను హామీ ఇవ్వలేదని అనేందుకు అవకాశం లేకుండా అన్నీ రికార్డెడ్‌గా ఉన్నాయని లోకేశ్ స్పష్టం చేశారు. "మోసపూరిత హామీలిచ్చిన మీరు అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటిపోయింది. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకి ఇచ్చిన హామీని ఇప్పటికైనా గుర్తుకుతెచ్చుకొని నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరుతున్నాం. దశాబ్దాల కాలంగా ఏపీ ట్రాన్స్‌కో, జెన్ కో, డిస్కంలలో 26 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారు.

ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మీ అడుగులో అడుగు వేసి మీ వెంట నడిచిన వారిని సీఎం అయ్యాక విస్మరించడం సరికాదు. తెలంగాణలో కాంట్రాక్టు కార్మికులని విద్యుత్ సంస్థలో విలీనం చేసుకుని ప్రొబేషనరీ కాలం ముగిశాక 24 వేల మందికి పైగా కార్మికులను రెగ్యులర్ చేశారు. అర్హత వయస్సు దాటిపోతుందని చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు"అని లోకేశ్ లేఖలో పేర్కొన్నారు.

## కవి సమయం

### గీతార్థం యిదిగో

- గీత ఒక కల్ప వృక్షము
- అది శ్రీ కృష్ణునిచే నాటబడినది
- వ్యాసునిచే పెంచబడినది
- ఉపనిషత్తులు దాని విత్తనములు
- జ్ఞాన ప్రభోదమే దాని అంకురం
- వివిధ శాస్త్ర రహస్యములు దాని కొమ్మలు
- విషయ విరక్తి, సహనము దాని చిగుళ్లు
- పరమాత్మ యొక్క పద్మముల పాద పద్మముల యందు
- భక్తియే దాని పుష్ప సుగంధం
- మోక్షమే దాని ఫలం
- నీవు దేవునివైపు ఒక అడుగు వేసినచో
- దైవం నీ వైపు పది అడుగులు వేయును
- నీ కర్తవ్యం నీవు చిత్తశుద్ధితో చేసినచో
- దైవం నీవు పొందవలసిన ఫలితం కన్న ఎక్కువే యిచ్చును
- కొండ గృహంలోనికి వెళ్లి అది పలుకలేదే అని తలంపకుము
- నీవు ధ్వని చేయి - అది ప్రతధ్వని చేయును
- ధనముతో వస్తువులను కొనగలము
- కాని మనఃశాంతిని కొనలేము
- ప్రలోభాలకు లొంగని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

... కవితా రచన
శ్రీ స్వామి అప్పాజి భగవాన్

# పంచాంగం

| మాసం : శ్రావణ; తిథి : ఏకాదశి ఉ.5.53; ద్వాదశి పూర్తి ఆర్ద్ర ఉ.11.38; రా.వ.12.57ల 2.44. | మంగళవారం 23-08-2022 |
|---|---|

**a మేషం** : విద్యార్థులకు దూర ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా ఏ చిన్న అవకాశం దొరికినా సద్వినియోగం చేసుకోవటం మంచిది. వృత్తుల వారికి అన్ని విధాలా కలిసిరాగలదు. పాతమిత్రుల కలయిక కొత్త అనుభూతినిస్తుంది.

**b వృషభం** : వైద్యులకు శస్త్రచికిత్స చేయు నపుడు మెళుకువ అవసరం. ధన వ్యయం, చెల్లింపులలో మెలకువ వహించండి. కాంట్రాక్టర్లు, బిల్డర్లకు నిర్మాణ పనులలో ఊహించని చికాకు లెదుర్కోవలసి వస్తుంది.

**c మిథునం** : ఆకస్మికంగా ప్రయాణాలు వాయిదాపడతాయి. స్త్రీలకు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. భాగస్వామికుల మధ్య కొత్త విష యాలు చర్చకు వస్తాయి. లీజు, ఏజెన్సీలు, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. విద్యార్థి నులకు ప్రేమ వ్యవహారాల్లో భంగపాటు తప్పదు. మిత్రులను కలుసుకుంటారు.

**d కర్కాటకం** : రియల్ ఎస్టేట్ రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. గతంలో నిలిపివేసిన పనులు పునఃప్రారంభిస్తారు. ఖర్చులు పెరిగినా ప్రయోజనకరంగా ఉంటాయి. కోర్టు వ్యవహారాలు, ఆస్తి పంప కాలు ఒక కొలిక్కి వస్తాయి. వ్యాపారాల్లో పెరిగిన పోటీని తట్టుకోవటానికి బాగా శ్రమించాలి. ఆలయాలను సందర్శిస్తారు.

**e సింహం** : సాంఘిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీ పనుల సాను కూలతకు పలుమార్లు తిరగవలసి ఉంటుంది. బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో నగదు డ్రా చేసే విషయంలో జాగ్రత్త అవసరం. పాత వస్తువులను కొంటే ఇబ్బందులు తప్పవు.

**f కన్య** : రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. మీ సమర్థతపై ఎదుటివారికి విశ్వాసం ఏర్పడుతుంది. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయల వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. దుబారా ఖర్చులు అధికం.

**g తుల** : రావలసిన ధనం చేతికందడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరుతుంది. స్త్రీల పట్టుదల వల్ల కుటుంబ సౌఖ్యం అంతగా ఉండదు. దంపతుల మధ్య అన్యోన్యత నెలకొంటుంది. హోటల్, కేటరింగ్ రంగాల్లో వారు పనివారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఒకానొక సందర్భంలో మిత్రుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది.

**h వృశ్చికం** :నిత్యావసర వస్తు వ్యాపారులకు స్టాకిస్టులకు పురోభివృద్ధి. బంధువుల రాక వల్ల మీరు కొంత అసౌకర్యానికి లోనవుతారు. దైవ సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటారు. కోర్టు వ్యవ హారాలు కొత్త మలుపు తిరుగుతాయి. మీ మాటే నెగ్గాలన్న పంతం విడ నాడండి.

**i ధనుస్సు** : స్త్రీలు కుటుంబ పరిస్థితులతో సర్దుకుపోవడం క్షేమ దాయకం. నూతన పరిచయాలు మీ పురోభివృద్ధికి నాంది పలుకుతాయి. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ఉపాధ్యాయులు విశ్రాంతికై చేయు యత్నాలు వాయిదా పడ తాయి.

**j మకరం** :మనశ్శాంతి కోసం కొన్ని విషయాల్లో సర్దుకు పోవటం క్షేమదాయకం. మీ సంతానం అత్యుత్సాహాన్ని అదుపులో ఉంచటం మంచిది. స్త్రీలకు పనివారితో ఒత్తిడి, చికాకులు తప్పవు.

**k కుంభం** : మీ ఏమరుపాటుతనం వల్ల పత్రాలు విలువైన వస్తువులు చేజారిపోయే ఆస్కారం ఉంది. రాజకీయాలలో వారికి ప్రత్యర్థులు పెరుగుతున్నారు అని గమనించండి. ప్రముఖుల కలయికతో పనులు సానుకూలమవుతాయి.

**L మీనం** : ఉపాధ్యా యులకు అదనపు బాధ్యతలు, పనిభారం వంటి చికాకులు తప్పవు. స్త్రీలపై శకునాలు, చుట్టుపక్కల వారి వ్యాఖ్యలు తీవ్ర ప్రభావం చూపుతాయి. కాంట్రాక్టర్లకు రావలసిన బిల్లుల వసూలులో ప్రయాసలను ఎదుర్కొంటారు.

## సంకీర్తన

# స్వామి కన్నా నామమే మిన్న

అయోధ్యా నగరంలో శ్రీరామచంద్ర భగవానుడు రాజ దర్బారులో విరాజిల్లుతున్నాడు. దేవర్షి నారదుడు, విశ్వా మిత్రుడు, వశిష్ఠాది మహర్షులెందరో ఉన్న ఆ సభలో ఒక ధార్మిక విషయం మీద చర్చ కొనసాగుతోంది. ఉన్నట్టుండి నారద మహర్షిభగవంతుడు గొప్పవాడా? భగవన్నామం గొప్పదా? అన్న సమస్యను లేవనెత్తాడు. దానిపై అక్కడ వాగ్వివాదం చెలరేగింది. కాలం గడుస్తున్నదే గాని ఋషి గణం ఒక నిర్ణయానికి రాలేకపోయారు. అదే సమయంలో హనుమంతుడు ఆ సభలోకి అడుగుపెట్టాడు. అతన్ని చూడగానే దేవర్షి మదిలో ఓ ఆలోచన మెరిసింది. వెంటనే ఆయన వాయు పుత్రుని వద్దకెళ్ళి, మహావీరా! ఇప్పుడు నీవు శ్రీరామునితోబాటు ఋషి వర్యులందరికీ నమస్కరించు. ఒక్క విశ్వామిత్రునికి మాత్రం నమస్కరించవద్దు. కారణం తర్వాత చెబుతాను అన్నాడు. నారదుని మాట కాదనలేక ఆయన చెప్పినట్టు చేశాడు హనుమ. విశ్వామిత్ర మహర్షి మనస్సు చివుక్కుమంది. అది కనిపెట్టిన నారదుడు ఒక్క అంగలో విశ్వామిత్రుని చెంత చేరి, మహర్షీ! హనుమంతునికి ఎంత గర్వమో చూశారా? నిండు సభలో మీకు తప్ప అందరికీ నమస్కరించాడు. మీరు తక్షణం అతడిని శిక్షింపజేయాలి! అన్నాడు.

దాంతో విశ్వామిత్రుడు అగ్నిహోత్రుడయ్యాడు.

ఆయన శ్రీరాముని సమీపించి, రాజా! నీకళ్ళెదుటే ఆంజనేయుడు నన్ను ఘోరంగా అవమానించాడు. కనుక రేపు సూర్యుడు అస్తమించే లోగా నీ చేతులతో అతనికి మరణదండన విధించాలి! అని ఆజ్ఞాపించాడు. శ్రీరాముడు నిశ్చేష్టుడయ్యాడు... అనన్య భక్తుడైన మారుతికి మరణదండన విధించడమా?... ఇది తనకు సాధ్యమయ్యే పనేనా... ఏమిటీ సంకట పరిస్థితి?... చాలాసేపు మధనపడి చివరకు గురువాజ్ఞ పాటించక తప్పదని నిర్ణయించుకున్నాడాయన. ఈ విషయం కొద్దిసేపట్లోనే నగరమంతా వ్యాపించింది. హనుమంతునికి మహాదుఃఖం కలిగింది. నారదుని చూస్తూ దేవర్షీ! మీరు చెప్పినట్టు చేసినందుకు ఇదా ఫలితం? భగవానుడు రేపు నన్ను వధిస్తాడు. ఇప్పుడు నేనేం చెయ్యాలి? అన్నాడు రుద్ధమైన కంఠంతో. అప్పుడు నారదుడు హనుమంతా! భయపడకు.

రేపు బ్రహ్మ ముహూర్తంలో సరయూ నదిలో స్నానంచేసి, చేతులు జోడించి శ్రీరామ జయ రామ జయ జయ రామ అని జపించు. విశ్వాస పూర్వకంగా చెబుతున్నాను. నీకెటువంటి ప్రమాదం జరగదు! అని అభయమిచ్చాడు. మరునాడు సూర్యోదయానికి పూర్వమే హనుమంతుడు సరయూ నదీ తీరానికి వచ్చాడు. స్నానమాచరించి నారద మహర్షి చెప్పిన విధంగా రామనామాన్ని జపించసాగాడు. జరగబోయే సంఘటన తిలకించడానికి మహర్షులతోబాటు అశేష జనం అక్కడికి వచ్చారు. శ్రీరాముడు హనుమంతునికి కొంత దూరంలో నిలబడి, కరుణార్ద్ర దృష్టితో చూస్తూ, అనిచ్ఛాపూర్వకంగానే అతడిపై బాణాలను వర్షింప సాగాడు. అలా సూర్యాస్తమయం వరకూ శ్రీరాముడు బాణాలు



వర్షింపజేస్తున్నా ఏ ఒక్కటీ శ్రీ రామనామం జపిస్తున్న మారుతిని బాధించలేకపోయింది. కుంభకర్ణాది మహారాక్షసులను వధించడంలో ఉపయోగించిన భయంకరాస్త్రాలు కూడా నిరుపయోగమయ్యాయి. ఇలా కాదని శ్రీరామ భగవానుడు బ్రహ్మాస్త్రాన్ని ఎత్తాడు. హనుమ చిరునవ్వుతో శ్రీరాముని చూస్తూ ఆత్మసమర్పణ చేసి, పూర్ణ్భావంతో ఆయన నామాన్ని జపిస్తూ స్థిరచిత్తంతో నిలబడిపోయాడు. పరిస్థితి గమనించిన నారదుడు విశ్వామిత్రుని చూస్తూ, మహర్షీ! ఇక మీరు మారుతిపై కోపాన్ని ఉపసంహరించుకొని బ్రహ్మాస్త్ర ప్రయోగాన్ని నివారించండి. ఇప్పటికే శ్రీరాముడు అలసిపోయి ఉన్నాడు. ఇక్కడున్న అశేష జనవాహినితోపాటు మీరుకూడా శ్రీరామనామ మహిమను ప్రత్యక్షంగా చూశారు కదా! అన్నాడు చిరుదరహాసంతో. భగవంతుని కంటే భగవన్నామమే మిన్న అయినదని విశ్వామిత్రునితోపాటు అక్కడున్న యావన్మందికీ అర్థమైంది.

అది నిరూపించడానికే నారదుడీ గొడవను సృష్టించాడని తేటతెల్లమైంది... విశ్వామిత్రుడు శ్రీరాముని చేత బ్రహ్మాస్త్ర ప్రయోగాన్ని విరమింపజేశాడు. ఆనందంతో వచ్చి వాయుపుత్రుడు తన ప్రభువు చరణకమలాలపై వ్రాలిపోయాడు. పిమ్మట విశ్వామిత్రునికి ప్రణమిల్లాడు. ప్రసన్న వదనంతో విశ్వామిత్ర మహర్షి హనుమను ఆశీర్వదించి- సంపూర్ణ శ్రద్ధాభక్తులతో శ్రీరామనామాన్ని జపించేవారికి సర్వపాపాలు హరించబడతాయనీ, సకల శుభాలు కలుగుతాయని ప్రవచిం చాడు. అందుకే అడుగడుగునా ఈ కలియుగంలో పాపారాశులే కనబడుతున్నా సరే శ్రీరామ నామాన్ని జపిస్తే చాలు ఆ పాపరాశులు మనలను అంటవు. నిరంతరమూ రామనామంతో మనసు, తనువు పులకించేలా జపం చేయగలగాలి. ప్రహ్లాదుడు చెప్పినట్టుగా తింటున్నా, తాగుతున్నా, నిద్రిస్తున్నా, నడుస్తున్నా సరే ఎపుడైనా భగవంతుని నామాన్ని మాత్రం వదలరాదు.

# వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైంది

కాకినాడ (విజయభాను న్యూస్) : వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని, రోజురోజుకు పెరుగుతున్న రాజకీయ నిర్బంధాలు, అక్రమ కేసులు, ప్రభుత్వా నిర్లక్ష్య ధోరణిని ప్రశ్నించేందుకు తెలుగు దేశం పార్టీఆధ్వర్యంలో కాకినాడ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని అధ్యక్షతన, డిగ్నిటీ ఫర్ ఉమెన్ జేఏసీ కాకినాడ, బాలాజీ సెంటర్ వద్ద గల కాస్మో క్లబ్ నందు వివిద మహిళా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఐ జాతీయ కార్యదర్శి లలితాదేవి మాట్లాడుతూ మహిళల పై జరుగుతున్న నేరాలను అరికట్టి నిందితులకు కఠినంగా శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమైక్య అధ్యక్షురాలు గంపా లోవరత్నం మాట్లాడుతూ మహిళలకు రక్షణా కల్పించటంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఎద్దేవా చేశారు.

జమాతే ఇస్లామ్ హింద్ అధ్యక్షురాలు ఎండి నాజ్మమ మాట్లాడుతూ గౌరవ పదవిలో వున్న ఎంపీ అశ్లీల్ల వీడియో బైటకి వచ్చినా కూడా ఎటువంటి చర్యలు తీసుకోక పోవటం దురదృష్టకరం అని అన్నారు. ప్రధాన కార్యదర్శి లీలా ప్రశాంతి మాట్లాడుతూ ఈ వైసీపీ ప్రభుత్వాల్లో మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులు లేవనీ హైళన చేశారు. సుంకర పావని మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు లేని విధంగా మహి ళలుపై దాడులు జరుగు తున్నాయిని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కనుక మహిళలుపై దాడులు అరికట్టలేకపోతే ఉద్య మాలు చెయటానికి వెనకాడభోమని సుంకర పావని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో జమాత్ ఈ ఇస్లామ్ హింద్ ఉపాధ్యక్షు రాలు ఎండీ షెహనాజ్, షేక్ అబీదా బేగమ్, ఎస్.ఫోజియా స్త్రీ శక్తీ మహిళా సంఘమ్ అధ్యక్షు రాలు సిహెచ్.పా ర్వతీ, సంఘ సభ్యులు, అంబేత్కర్ మహిళా సంఘమ్ అధ్యక్షురాలు సికోటి హైమావతి, పలువురు మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తదనంతరం జిల్లా పోలీసు కార్యాలయానికి జేఏసీ సభ్యుల తో వెళ్లి జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌కి రిప్రెసెంటేషన్ ఇవ్వటమైనది.




# సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.2,00,000/- విరాళాలు





అన్నవరం(విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయ వాడ రామ వరస పాడు గ్రామానికి చెందిన ఎమ్.దిలీప్ కుమార్,కృష్ణ ప్రియ లు రూ.1,01,116/- విరాళమును దేవస్థానం కార్యనిర్వాహణాధి కారి ఎన్.వి.నత్యనారాయణ మూర్తి కి అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో నవంబర్ 8వ తేదీన అన్నదానం జరిపించవలసిందిగా కోరారు.ఈ సందర్భంగా దాతలను ఈవో ఎన్.వి.సత్యనారాయణ మూర్తి అభినందించారు. అదేవిధంగా కాకినాడ కు చెందిన పుర్రె.ఉమాదేవి రూ.1,00,001/- విరాళమును దేవస్థానం పిఆర్వో విభాగం సూపరిం టెండెంట్ ఐ.వి.రామారావు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో కార్తీక శుద్ధ చతుర్ధశి నాడు నూకల ఆనందరావు పేరున అన్నదానం చేయవలసిందిగా కోరారు.ఈ సందర్భంగా దాతలను సూపరింటెండెంట్ ఐ.వి.రామారావు అభినందించారు.

# ఎస్సీ ఎస్టీల ఉప కులాల ఏబిసిడి ల వర్గీకరణ చట్ట భద్రత కల్పించాలని కేంద్రమంత్రులకు వినతిపత్రాలు

సబ్బవరం (విజయభాను న్యూస్) : కేంద్ర మంత్రివర్యులు, కిషన్ రెడ్డి, అర్జున్ ముండా ,ఎమ్మెల్సీ మాధవ్ కి, సోము వీర్రాజు, కురుసా ఉమా మహేశ్వరరావు కి సోమవారం అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధినేత మంద కృష్ణమాదిగ అధ్వర్యంలో ఎస్సీ, ఎస్సీ ఉప కులాల ఏ, బి, సి, డి, ల వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని వినతి పత్రాలు అందజేశారు. 28 సం,, రాల సుదీర్ఘ పోరాటంలో ప్రస్తుతం కేంద్ర లో ఉన్న తమ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేము అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే ఎస్సీ ఎ బి సి డి ల వర్గీకరణ వర్గీకరణ చేస్తామని మా అధి నాయకుడు కు మీరు మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఎనిమిది సంవత్సరాలు గడిచిన ఇప్పటివరకు ఎస్సీల వర్గీకరణ ఊసెత్త లేదు, మాదిగలకు న్యాయం చేయాలని కూడా మర్చిపోయారు. కేంద్రంలో అధికారం లో ఉన్న మీ పెద్దలు మీరు మీ బిజెపి ప్రభుత్వము ఎస్సీ ల వర్గీకరణ చేస్తేనే ఎస్సీ లో ఉన్న 59 కులాల వారికి,సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యగ అవకాశాల్లో సమాన న్యాయం మా మాదిగ లకు జరుగతుందని తమకు తెలియ జుసుకుంటున్నాము. కావున రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో నైన ఎస్సీ ల ఏ బి సి డి ల వర్గీకరణ బిల్లు పెట్టి శాశ్వత పరిష్కారం చేయాలని కోరుతున్నమని మా ఈ విన్నపాన్ని సహృదయం తో అలోసించి ఎస్సీ ఏ బి సి డి ల వర్గీకరణ బిల్లు ద్వారా మా మాదిగ లకు న్యాయం చేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో



ఎమ్మార్పీఎస్ పెందుర్తి కన్వీనర్ గొటివాడ సామ్రాట్ కుమార్ మాదిగ, కొల్లి చిన్న అప్పారావు, కట్టుమూరి మంగరాజు,చోడవరం ఎమ్మార్పీఎస్ ఇంఛార్జి ఎలకా మల్లి బాబు మాదిగ, మాడుగుల ఇన్ చార్జ్ మొర్త శ్రీనివాసరావు మాదిగ, చెవ్వేటి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

# స్లాగ్ మాఫియా నుండి బ్రిక్ ఇండస్ట్రీస్ ను కాపాడాలి

## టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి పొన్నమల్ల కొండబాబు



అచ్యుతాపురం (విజయ భాను న్యూస్) :స్లాగ్ మాఫియాను అరికట్టి, బ్రిక్ ఇండస్ట్రీ వారికి పాత పద్ధతిలోనే స్లాగ్ ను అందించాలని అనకాపల్లి జిల్లా టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి పొన్నమల్ల కొండబాబు డిమాండ్ చేశారు. సోమవారం సెజ్ లో గల పరిశ్రమలో స్లాగ్ ను పాత పద్ధతిలోనే ఇవ్వాలని బ్రిక్ ఇండస్ట్రీదారులు చేస్తున్న నిరసనలో పాల్గొని మాట్లాడారు. అజిత్ పరిశ్రమలో గల స్లాగ్ ను గతంలో బ్రిక్ ఇండస్ట్రీవారికి ఇచ్చి ప్రోత్సహించే వారన్నారు. బ్రిక్ ఇండస్ట్రీ పై ఆధారపడి వందల కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. నేడు పరిశ్రమ నుండి వచ్చే స్లాగ్ కు దళారులు బయలుదేరి బ్రిక్ ఇండస్ట్రీవారికి ఇవ్వకుండా అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేయడం అన్యాయం అన్నారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం స్పందించి బ్రిక్ ఇండస్ట్రీ వారికి స్లాగ్ అందించి న్యాయం చేయాలని కోరారు. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# జన సైనికుల కుటుంబాలకు అండగా జనసేన



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : జన సైనికుల కుటుంబాలకు జనసేన అండగా ఉంటుందని యలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ సుందరపు విజయ్ కుమార్ అన్నారు . ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పూడిమడక శివారు కొండపాలెం గ్రామానికి చెందిన జన సైనికుడు వాసుపల్లి రాజు కుటుంబాన్ని సోమ వారం ఆయన జన సైనికులతో కలిసి పరా మర్శించారు. తక్షణ సహాయంగా 10 వేలు రూపాయలు అందజేశారు. జనసేన పార్టీ 5 లక్షలు ఇన్సూరెన్స్ తో పాటుగా, పార్టీ తరపు నుంచి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా మత్స్యకార నాయ కులు చోడిపల్లి అప్పా రావు, జనసేన వర్కింగ్ కమిటీ అద్యక్షులు మేరుగు ప్రవీణ్ కుమార్, గ్రామ పార్టీ అద్యక్షులు కారి నూకరాజు, మేరుగు శ్రీను, కరెడ్ల ప్రకాష్ , కోరుకొండ ప్రసాద్, చోడిపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# 24న గొన్నా కళాశాలలో ఇంటర్వ్యూలు

## గొన్నా కళాశాల సెక్రటరీ హేమ్‌చంద్ నాయుడు



పరవాడ (విజయభాను న్యూస్): స్థానిక గొన్న కళాశాలలో బుధవారం ఒకొహమా ప్రాంగణ ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి అని స్థానిక గొన్నా కళాశాల సెక్రటరీ గొన్నా హేమచంద్ నాయుడు తెలపారు. ఇంటరవ్యూకి కావాల్సిన అర్హతలు ఐటిఐ పాసైన విద్యార్థులు (మగవాళ్ళు) 24 వయస్సు లోపు విద్యార్థులు. డిప్లొమో పాసైన విద్యార్థులు (అడవాళ్ళు) (19, 20,21,22 సంవస్యరం పాసైట్) 24 వయస్సు లోపు విద్యార్థులు ఈ ప్రాంగణ ఇంటర్వ్యూ కి అరుహులు. అని తెలిపారూ..ఎవరైనా ఉంటే ఈ నెంబర్ ను 7981413067 ఈ నెంబర్ ను సంప్రదించాలానీ కోరారు.

# పెదముషిడివాడలో సమగ్ర భూ రీసర్వే



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలము పెదముషిడివాడ పంచాయితీలో సమగ్ర భూ రీసర్వేను స్ధానిక తహాశీల్ధార్ ప్రకాష్ రావు పరిశీలించారు..డ్రోన్ కెమెరా సహయంతో భూ సర్వే పనులు ఎల్ పి అర్ ప్రారంభం అయ్యాయి అని తెలిపారు. మండలములో అన్ని రెవిన్యూ గ్రామాల్లో భూ రిసర్వే పనులు నిర్వహించునున్నామని తెలిపారు. భూ సర్వే పనులు విషయంలో రెవిన్యూ సిబ్బందికి ప్రజలు సహకరించాలానీ తహాశీల్ధార్ ప్రకాష్ రావు కోరారు. పెదముషిడివాడ పంచాయితీలో భూ రిసర్వే పూర్తికాగా కన్నూరు పంచాయితీలో భూ రీసర్వే పనులు చేపట్టామనీ ఈ సందర్భంగా తహాశీల్ధార్ ప్రకాష్ రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పెదముషిడివాడ ఎంపిటీసి సభ్యులు ఒమ్మి వెంకటరావు, విఅర్వో అప్పారావు తథితర్లు పాల్గోన్నారు.

# చివరి దశలో ఖరీఫ్ వరినాట్లు




వరినాట్లు వేస్తున్న దృశ్యం

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : చివరి దశలో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా చేపడుతున్నారు. అదను బాగుండటంతో సాధ్యమైనంత తొందరలో వరినాట్లు ముగించేయాలని రైతులు తొందరపడుతున్నారు. ఇప్పటికే 80 శాతం వరినాట్లు పూర్తయినట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

# అన్ని దానాలు కన్నా అన్నదానం మిన్నా


## మాజీ జెడ్పీటీసీ సభ్యులు పిజెఅర్



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలము రావాడ పంచాయతీ శివారు బొట్టవానిపాలెం గ్రామం లో శ్రీకృషుడు అనుపు సందర్భముగా భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. వేకువ జాము నుండి శ్రీకృష్ణుడు కి పూజా కార్యక్రమం జరిగినది . మాజీ జడ్పీటీసీ సభ్యులు పైలా జగన్నాధ రావు ముఖ్యఅతిథిగా హజరై ఈ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు, ఈ సందర్భంగా అయన మాట్లడుతూ అన్ని దానాలు కన్నా అన్నధానం మిన్నా అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య ప్రధాన కార్యదర్శి భరణికాన బాబురావు , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శబండారు అప్పలనాయుడు, వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు) గొర్లి కనకారావు (మాజీ సర్పంచ్),కర్రీ అప్పలరాజు (జిల్లా యాదవ సంఘం నాయుకులు), సారిపల్లి జోగినాయుడు (మాజీ ఎంపీటీసీ),కారుకొండ అప్పారావు ( మండల రైతు ప్రధాన కార్యదర్శి),బొట్ట నూకరాజు , మొల్లి గంగాధర్ ( వార్డ్ మెంబెర్), సారిపల్లి ఆనంద్ ,గోలగాని బాబురావు( స్కూల్ కమిట చైర్మన్), ,గోలగాని సన్యాసి రావు ,కారుకొండ పూర్ణ ,కారుకొండ మహేష్ ,సీర సన్యాసిరావు ,జోగా అప్పలరాజు ,సారిపల్లి అప్పలరాజు ,కారుకొండ నాని ,మొల్లి నాగేష్ ,మొల్లి సన్యాసిరావు ,నాయుకులు యువకులు గ్రామప్రజలు,తథితర్లు పాల్గోన్నారు.

# లోకేష్ అరెస్ట్ దారుణం

## తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోడి అరుణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి, శాసన మండలి సభ్యులు నారా లోకేష్ బాబును బలవంతంగా అరెస్టు చేయడం దారుణం అని తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోడి అరుణ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా లేదా అన్న అనుమానం కలుగుతుందన్నారు . తెలుగుదేశం పార్టీ నాయకుడిని పరామర్శిం చడానికి పలాస వెళ్తున్న లోకేష్ బాబుని డిఎస్పి అడ్డుకుని, దురుసుగా ప్రవర్తించి, చేయి పట్టి తొసివేయటం పోలీసుల దౌర్జన్యానికి, దురహంకారానికి నిదర్శనం అన్నారు శాంతిభద్రతలను కాపాడవలసిన పోలీసులు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు పరామర్శకు, ఓదార్పునకు వెళితే 144 సెక్షన్ అమలు చేసి ప్రజల హక్కులను కాలరాస్తున్నారు

నారా లోకేష్ ను పోలీసులు అరెస్టు చేయడం చూస్తుంటే ఈ రాష్ట్రాన్ని డీజీపీ పరిపాలిస్తున్నారా అన్న అనుమానం కలుగుతున్నది. భారతదేశ మంతా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు అవుతుంటే! ఆంధ్ర రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారు. పోలీసులు పూర్తిగా వైసిపి నాయకుల తొత్తులుగా, వ్యవహరిస్తున్నారు.

ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి మానసికంగా ఇబ్బందికి గురి చేస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న పలాస లో పోలీసులు యుద్ధవాతావరణం సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

# చిరుపుట్టినరోజు సందర్భంగా మొక్కలు పంపిణీ



పరవాడ (విజయభాను న్యూస్): మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సోమవారం మడకరమేష్ నాయుడు అద్వర్యంలో లంకెలపాలెంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా బలిరెడ్డి అప్పారావు, సుందరపు శ్రీనువాస్ హజరై మొక్కలును పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అతిథిలు మాట్లడుతూ చిరంజీవి సేవలును కొనియాడారు. ఈ కార్యక్రమంలొ నందవరపు శ్రీనువాస్ చిరంజీవీ అభిమానులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ టూ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం





అల్లూరిజిల్లా. విజయభాను. పాడేరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాడేరు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ టూ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం కళాశాల సెమినార్ హాలులో సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం అయినది. దీనిలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనం చిట్టి అబ్బాయి గారు మాట్లాడుతూ, చెడు వ్యసనాలకు గురికాకుండా, మత్తు పానీయాలకు, గంజాయి డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, మరియు వీటిపై మీ యొక్క దత్తత గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిం చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాడేరు సబ్ ఇన్స్పెక్టర్ జి. లక్ష్మణరావు మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులకు ఈ క్రింది అంశాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు బాల కార్మికుల స్థితిగతులు యువత మత్తు పానీయాలకు గంజాయి డ్రగ్స్ కు దూరంగా ఉండాలని తెలియజేశారు.

అలాగే సైబర్ నేరాలు ఆన్లైన్ దొంగతనాలు హాస్టల్లో కళాశాలలో ర్యాగింగ్ మరియు సీనియర్స్ జూనియర్స్ ని వసతి గృహాలలో ఈవ్ టీజింగ్ చేయకుండా క్రమశిక్షణతో మెలగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.యన్ రసూల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ జి. గౌరీ శంకర్రావు పి.రమేష్ కానిస్టేబుల్ ఎం గణపతి కళాశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దు చేయాలి ప్రదర్శన...




అల్లూరిజిల్లా. విజయ భాను. పాడేరు : అఖిలపక్ష కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా అల్లూరి సీతారామ జిల్లా పాడేరులో ప్రదర్శన నిర్వహించి ఐటిడి యొక్క నరసన్న తెలియ జేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ తీసుకొచ్చిందని ఈ లేబర్ కోడ్స్ అమల కోసం ఆగస్టు 25న మన రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల కార్మిక మంత్రులతో సదస్సు నిర్వహిస్తుందని ఈ సదస్సులో కార్మిక వ్యతిరేక నష్టం కలిగించే లేబర్ కోల్డ్ అమలకు చర్యలు తీసుకుంటున్నారని ఇది కార్మిక వర్గానికి నష్టం కలిగించే చర్య కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసేందుకు కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న నియోజకవర్గ బోనస్ సంఘం పెట్టుకునే హక్కు ఇటువంటి అనేక చట్టాల్ని ఈరోజు బిజెపి ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోర్సుగా మార్చిందని దీనివలన కార్మికులకు ఎటువంటి హక్కులు అమలు కావని ఆగస్టు 25న జరుగు సమావేశాన్ని అన్ని రాష్ట్రాల మంత్రులు బాయికాట్ చేయాలని పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో...

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె స్వరావమ్మ సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమా మహేశ్వరరావు జిల్లా కార్యదర్శి ఎల్. సుందరరావు, ఏఐటి యుసి జిల్లా కన్వీనర్ జల్లి రాజబాబు సహాయ కన్వీనర్ అమర్ తదితరుల ఆధ్వర్యంలో జరిగింది.

## మోడీ కి కార్మిక సత్తా ఏమిటో చుపిస్తాం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు

# 25 న తిరుపతి లో మంత్రులను అడ్డుకుంటాం




ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె .రాంబాబు
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాజమహేంద్రవరం శ్యామల సెంటర్ వద్ద ఏఐటియుసి సిఐటియు ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన దృశ్యం

# 64వ వార్డ్ లో గడప గడపకు మన ప్రభుత్వం



గాజువాక (విజయభాను న్యూస్): నియోజకవర్గంలో జీవీఎంసీ 64వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది.

వార్డులోని వెంకన్నపాలెం,చిన అప్పా రావు కాలనీ, సత్యనారాయణపురం గ్రామాల్లో ప్రతీ గడపకు వెళ్లి ఈ మూడేళ్ళ పాలనలో ప్రజలకు ఎంత లబ్ది చేకూర్చామో వివరిస్తూ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ,ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులకు ఎమ్మెల్యే. నాగిరెడ్డి ఆదేశా లిచ్చారు. ఈ కార్యక్రమంలో 64వ వార్డు అధ్యక్షుడు దర్మాల శ్రీను,పితాని అన్నవరం, సుమన్, శానిటరీ ఇన్స్పెక్టర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో పాటు స్థానిక వైసీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి




అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన అచ్యుతాపురంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన తిరుపతిలో నిర్వహిస్తున్న సమావేశాన్ని రద్దు చేయాలని , మోడీ తెచ్చిన లేబర్ కోడ్స్ కార్మికులకు, కార్మిక హక్కులకు, చట్టాలకు విరుద్ధమని ఆరోపించారు. ఈ చట్టాలు తీసుకురావడం దుర్మార్గం ఈ కోడ్స్ ను రద్దు చేసే వరకు దేశ వ్యాప్తంగా కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.సోమనాయుడు, బాబురావు, కనకా రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీరు అందించాలి

## జడ్పీటీసీ దీసరి గంగరాజు



ధర్నా నిర్వహిస్తున్న జడ్పీటీసీ దీసరి గంగరాజు, నాయకులు

అనంతగిరి (విజయభాను న్యూస్,) అనంతగిరిలో మంచినీరు కొరకు ధర్నా మండల కేంద్రంలో గడిచిన 20 రోజులుగా త్రాగునీరు కోసం అల్లాడుతున్న ఎవరూ పట్టించుకోలేదంటూ అనంతగిరి ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు ఈ ధర్నాలో జడ్పిటిసి గంగరాజు పాల్గొని మండల కేంద్ర వాసులు పడుతున్న కష్టాలను డబ్ల్యూ ఎస్ జే ఈ గౌతమ్ కు వివరించారు అనంతగిరి ఎగువ శోభ పంచాయతీ లోగల మర్దగూడా కొత్తవలస హెక్టాగూడ అనంతగిరి అనంతగిరి పెద్దూరు మొండి జాము కూడా గ్రామాలకు మంచినీటి సౌకర్యం కొరకు సుమారు రెండు కోట్ల 50 లక్షల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ శాశ్వతంగా మంచినీరు అందించలేకపోతున్నారని దీనికి గాను అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు ఎప్పుడు మంచినీరు రాకపోయినా పది నుంచి 20 రోజుల వరకు దాహం కేకలు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు ఇది పంచాయతీ పరిధిలో లేకపోవడం వలన అధికారుల దయ దక్షిణాల మీద ఆధారపడవలసి వస్తుందని వారు ఎప్పుడు దయతెలిస్తే అప్పుడు మంచినీరు అందుతుందని తెలిపారు ఈ విషయం నే త్వరలో విశాఖపట్నంలో జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావించి శాశ్వత పరిష్కారం కొరకు పోరాడుతానని హామీ ఇచ్చారు జే ఈ గౌతమ్ మాట్లాడుతూ నేను కొత్తగా అనంతగిరి జాయిన్ అయ్యానని ఈ స్కీం కొరకు తమకు తెలియదని త్వరలో పూర్తిస్థాయిలో సర్వే జరిపి శాశ్వత పరిష్కారం కొరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు సోమవారం సాయంత్రానికి మండల కేంద్ర వాసులకు మంచినీరు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గంగరాజు తోపాటు అనంతగిరి సర్పంచ్ సోమల రూతు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుచ్చిబాబు జోగులు, శంకర్రావు టోకూరు సర్పంచ్ మోసియా పేంగడ మాజీ సర్పంచ్ కొండలరావు మండల కేంద్రంలో ఉన్న మహిళలు పాల్గొన్నారు.

**సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం గ్రామంలో 40 సంవత్సరాల నుండి ఎస్సీ పేట ప్రజల ఆధీనంలో ఉన్న భూమిలోకి రావద్దని, ఆ స్థలంలో ఉన్న అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఎస్సై, సి.ఐ, ఎమ్మార్వో సమక్షంలో తొలగించేయడం జరిగింది. దళితులు ఈ స్థలంలోకి రాకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసారు. విగ్రహాన్ని తొలగిస్తున్న సమయంలో వీడియోలు తీస్తున్న దళిత యవకులపై సి.ఐ బెదిరింపులు చేసారు. అందరిపైనా కేసులు నమోదు చేస్తానని హెచ్చరికలు.**

# దండకారణ్య కళాశాలలో ఘనంగా విప్లవ శతవార్షికోత్సవం





అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ (విజయభాను న్యూస్) : మన్యం విప్లవ శత వార్షికోత్సవం సభ అరకు లోయ దండకారణ్య కళాశాలలో ఘనంగా విప్లవ సతవాసికోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులను తరిమికొట్టిన అల్లూరి సీతారామరాజు గిరిజన ప్రాంతంలో స్వతంత్ర పోరాటాలు సమరయోధులు పోరాటాల పూర్తితో గిరిజన చట్టాల హక్కుల రక్షణకు ఉద్యమించాలని నిలుపునిచ్చారు బ్రిటిష్ వారిపై పోరాటం చేసి సాధించిన 5వ షెడ్యూల్ చట్టాలు నేటి ప్రభుత్వాలు రద్దు చేయడం దారుణం అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధం అణచివేత తో పౌర సమాజం ఉందా అని మతో న్మాదం ప్రాంతీయ తత్వాన్ని పెంచే విధంగా పాలకులు రెచ్చగొడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు జీవో నెంబర్ 3 రద్దు చేసి నేటి రెండు ఏళ్ళు గడుస్తున్నా పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని డిమాండ్ చేశారు ఉన్న రిజర్వేషన్ అమలు చేయకుండా ప్రభుత్వ రంగం సంస్థల కారు చౌకగాకార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్నారని సామాజిక న్యాయం అందాని ద్రాక్షల మారిందని అన్నారు 75 ఏళ్ల స్వతంత్రం పల్లాలు అందని ద్రాక్షల మారిందని అన్నారు అడవి నుండి ఆదివాసీలు గెంటివేయాలని చట్టాలు సవరణ చేస్తున్నారని ధ్వజమెత్తారు చింతపల్లి ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతి రద్దు చేయాలని లేకపోతే పోరాటాలు తప్పదని హెచ్చరిక చేశారు ఆదివాసి ఉద్యమాలను అణచివేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివారిస్తున్నాయని ఆదివాసి మాతృభాష కను మరుగైపోతుందన్నారు స్వతంత్ర పోరాటయోధుల పూర్తితో పోరాటాలు చేయాలని అల్లూరి సీతారామరాజు చిత్రపటాన్ని పూలమాలవేసి నివాళులర్పించ రు ఏజెన్సీ ప్రాంతం మన్య విప్లవ అసువులు బాసిన ఆదివాసి పోరాట యోధులను ఆశయాల కోసం గిరిజన చట్టాలు హక్కులు రక్షణ కోసం రిజర్వేషన్ అమలు చేయాలని భవిష్యత్తులో పోరాటాలు చేయాలని పిలుపునివ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో

గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న గిరిజన సంఘం జిల్లా నాయకులు కె సత్య నారాయణ ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పి సరేంద్ర మండల ఉపాధ్యక్షులు రామూర్తి మండల నాయకులు జి హరి కార్తిక్ రఘునాథ్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



### జానపద కళలను కాపాడుకుందాం

## ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు

సీతంపేట (విజయభాను న్యూస్) : గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళలకు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదని ఏపి రాష్ట్ర భాషా సాంస్కృతిక మండలి ఛైర్మన్ వంగపండు ఉష అన్నారు. కాబట్టి ప్రతీ ఒక్కరూ జానపద కళలను కాపాడుకునే విధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్నేహాంజలి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమ వారం రాత్రి ఇక్కడ పౌర గ్రంధాలయంలో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా సేవా పరులుగా పేరుగాంచిన మాతారికార్డింగ్ సెంటర్ అధినేతలు పల్లి నాగభూషణం, బిన్నాల నరసింహమూర్తులను ఘనంగా సత్కరించారు.



## ప్రజా రవాణా ద్వారా జివిఎంసి కార్యాలయానికి చేరుకున్న మేయర్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు ప్రతి పౌరుడు కృషి చేయాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయానికి ఎటువంటి వాహనాలకు అనుమతి లేనందున ఆమె తమ క్యాంపు ఆఫీసు నుండి ఆర్ టి సి బస్సులో ప్రయాణించి జివిఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి పౌరుడు కాలుష్య నియంత్రణకు కృషి చేయాలని, వారంలో ఒక్క రోజు తమ సొంత వాహనాలను వదిలి ప్రజా రవాణాను ఉపయోగించాలని సూచించారు. నగరంలో ఉన్న ప్రతీ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల సిబ్బంది, అధికారులు, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె ఆర్ టి సి బస్సులో తమ క్యాంప్ ఆఫీసుకు చేరుకున్నారు.



## నిజాయితీ.. నిబద్ధతలే ప్రామాణికాలు

- భూ సర్వే లో శ్రీకాకుళం టాప్
- సీసీఎల్‌ఏ నిధులు రూ.1.10 కోట్ల వ్యయంతో తహసీల్దార్ కార్యాలయం
- పి.ఆర్.బిల్డింగ్ కాపిటల్ గ్రాంట్ రూ.1.20 కోట్ల నిధులతో ఎం.పి.డి.ఓ కార్యాలయం ప్రారంభోత్సవం
- రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం. (విజయభాను న్యూస్) : ప్రభుత్వ ఉద్యోగులకు నీతి,నిజాయితీ, నిబద్ధతలే ప్రామాణీకాలని, ఆ దిశగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్లు మరియు స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. గార మండల ప్రధాన కేంద్రంలో రూ.1.10 కోట్లు సిసిఎల్‌ఏ నిధులతో నిర్మించిన నూతన తహశీల్దార్ భవనానికి, పి.ఆర్.బిల్డింగ్ కాపిటల్ గ్రాంట్ రూ.1.20 కోట్ల నిధులతో నిర్మించిన మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమం మండల అధ్యక్షులు గొండు రఘురామ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రెవెన్యూ శాఖామాత్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని భవనాలకు రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు మనసు పెట్టి పనిచేయాలంటే అందుకు తగిన విధంగా సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలని, అపుడే మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు వీలుకలుగుతుందని నమ్ముతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలోనే ఈ భవన నిర్మాణాలకు శంకుస్థాపన వేయడం జరిగిందని, వాటిని ఈ ప్రభుత్వం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. పరిపాలన వికేంద్రీకరణతోనే మంచి పాలన, మంచి మార్పు వస్తుందన్నారు. అందులోభాగంగా గ్రామీణ స్థాయిలో పరిపాలన అందించాలనే సదుద్దేశ్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి దిగువస్థాయి ప్రజల చెంతకే పరిపాలనను తీసుకురావడం జరిగిందని తెలిపారు. పంచాయతీ స్థాయికి ఓ కార్యాలయాన్ని తీసుకుని వచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదని, తద్వారా ప్రజాప్రతినిధుల వద్దకు, ఎం.పి.డి.ఓ, తహశీల్దార్ కార్యాలయాలకి ఇది వరకులా ప్రజలు రావడం లేదని, ఇదంతా పరిపాలన వికేంద్రీకరణ వల్లనే సాధ్యపడిందని ఆయన అభిప్రాయపడ్డారు.

# అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలి

## స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకూడదు

### - జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎట్టి పరిస్థితుల్లోను రీ ఓపెన్ కాకూడదని జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారం మరియు పలు విషయాల పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో అలక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుండి స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీలు ఎట్టి పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ కాకూడదని, కాలపరిమితిలోగా దరఖాస్తులన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రొబేషన్ పూర్తి అయిన సచివాలయం ఉద్యోగులకు సి.పి.యస్ నంబర్ లు రావటానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న ముఖ్య సూచనలు ఆలస్యం చేయకుండా అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న జగనన్న తోడు, విద్యా దీవెన వంటి ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు అందించే విషయం లో అలసత్వం వలదని అధికారులను ఆదేశించారు.

ఏఎన్ఎం లు, మహిళా పోలీసులు , వెల్ఫేర్ అసిస్టెంట్ లు వారి పరిధిలో ఉన్న ప్రభుత్వ పాటశాలల్లో తరుచూ తనిఖీలు నిర్వహించి పిల్లల సంక్షేమం కొరకు కృషి చేయాలన్నారు. అసంఘటిత కార్మికులు వివరాలను వెంటనే ఇ-శ్రమ్ యాప్‌లో నమోదు చేయించా లని జిల్లా లేబర్ అధికారికి ఆదేశించారు. ప్రతి సచివాలయంలో IRCTC ద్వారా ట్రైన్ టికెట్ బుకింగ్ సేవలు ప్రారంభించటం జరిగిందని వాటిని ప్రజలు ఉపయోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని GSWS కోఆర్డినేటర్ ను ఆదేశించారు.

ఏ. పీ. సేవ పోర్టల్ ద్వారా సచివాలయంలో అందుతున్న వినతులు సంఖ్య చాలా తక్కువగా ఉందని, కావున ప్రతి ఒక సచివాలయం లో దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని జీ.వీ.యం.సీ అధికారులకు ఆదేశించారు.

తదుపరి జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ప్రజలనుండి విజ్ఞప్తులు స్వీకరించారు. సోమవారం స్పందన కార్యక్రమం లో 190 విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, ఆర్.డి.ఓ హుస్సేన్ సాహెబ్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు : మాజీ ఎంపీ ఉండవల్లి



రాజమహేంద్రవరం: మార్గదర్శి కేసులో రామోజీరావు తానేమీ తప్పు చేయలేదని చెప్పుకొస్తున్నారని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మార్గదర్శిపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ఉండవల్లి మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం ఈ కేసులో ఇంప్లీడ్ అవడం శుభపరిణామమని చెప్పుకొచ్చారు. సీఎం జగన్ నిర్ణయంతో న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అఫిడవిట్ దాఖలు చేయాలని కోరారు. ఈ కేసులో తప్పక ఫలితం తేలుతుంది. మార్గదర్శి అవినీతి బట్టబయలవుతుంది. కోర్టు ముందు అందరూ సమానమేనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వ్యాఖ్యానించారు.

# ప్లాస్టిక్ పై యుద్ధానికి సిద్ధం

### - తీరం వెంబడి ప్రతీ పాయింట్ పరిశీలన - బృహత్తర కార్యక్రమానికి నగర ప్రజలు మద్దతు

### - జివిఎంసి కమిషనర్ డాక్టర్.జి.లక్ష్మీశ




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఆగస్టు 26వ తేదీన జరిగే విశాఖ తీర ప్రాంత శుభ్రతకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విశాఖ కోస్టల్ బ్యాటరీ నుండి భీమిలి వరకు తీర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన 39 పాయింట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశంలోనే ప్లాస్టిక్ నిషేదిత నగరాలలో విశాఖను ముందు నిలపాలని, ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను చూడాలని తెలిపారు. ఈ నెల 26వ తేదీన విశాఖ తీరం వెంబడి సుమారు 28 కి.మీ. పొడవున 39 ప్రాంతాలలో బీచ్ శుభ్రత కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరుగుతందని, ఈ కార్యక్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి హాజరు అయ్యే అవకాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 20 వేల మంది ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, విధ్యా సంస్థలు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమానికి న్యూ యార్క్ ఎన్జిఓ సంస్థ "పార్లే ఫర్ ది ఓషన్" ఏంతో కృషి, సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్లాస్టిక్ నియంత్రణపైన, పరిసరాల పరిశుభ్రత పైన అవగాహన కలుగుతుందని తెలిపారు. తీరం వెంబడి ప్రతీ పాయింట్ వద్ద కొంత మంది అధికారులను గ్రూపులుగా నియమించి, వారి ద్వారా బీచ్ శుభ్రత చేపట్టి, ఆ వ్యర్థాలను తరలింపు ప్రక్రియ ఒక యాక్షన్ ప్లాన్ ప్రకారం చేయాలని అదుకారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ వై. శ్రీనివాస రావు, ప్రధాన పట్టణ అధికారి సురేష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, డిసిపి పద్మజ, ఎసిపి మహాపాత్రో, ఎస్.ఇ. కృష్ణా రావు, ఆయా జోన్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆగ్రా మున్సిపల్ కార్పొరేషన్ సందర్శించిన జివిఎంసి కార్పొరేటర్లు



సందర్భంగా ఆగ్రా కార్పొరేషన్ లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఆగ్రా చరిత్ర, పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజి వ్యవస్థ, విద్యుత్, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు మొదలైనవి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ తో ఆగ్రా మేయర్, కమిషనర్ కార్పొరేటర్ల బృందానికి వివరించారు. అలాగే జివిఎంసి అవలంబిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులు పై డిప్యుటీ మేయర్ జియ్యాని శ్రీధర్ వారికి వివరించారు. ఈ సందర్భంగా జివిఎంసి సహాయక కమిషనర్ టి. నాగేంద్ర కుమార్ ఆగ్రా మున్సిపల్ కార్పొరేషన్ బృందానికి జివిఎంసి తరుపున కృతజ్ఞతలు తెలుపుతూ పరస్పరం జ్ఞాపికలను అందించుకున్నారు. అనంతరం స్పాక్ బ్రెస్సన్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆహ్వానం మేరకు డంపింగు యార్డు, కంపోస్ట్ యార్డు తయారీ కేంద్రాన్ని సందర్శించి వారు చేపడుతున్న ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో



జివిఎంసి ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, ఆగ్రా ఎన్విరాన్మెంటల్ ఇంజనీరు భూషణ్ పంకజ్, సైట్ ఇంజనీరు వివేక్, వినోద్ గుప్తా, అదనపు కమిషనర్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొనారు.





VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com